రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

నిధులు మంజూరైనా మొదలుకాని పనులు


అధ్వానంగా వెంకటాపూర్-నక్కలపల్లి రోడ్డు


గుంతల్లో వర్షం నీటితో కుంటను తలపిస్తున్న చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు

- వర్షాలకు మరింత దెబ్బతింటున్న రోడ్లు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. గత పదేళ్లుగా రోడ్లకు మరమ్మతులు లేక పోవడంతో చాలా గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారాయి. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరై అసెంబ్లీ ఎన్నికల ముందే శంఖుబండలు సైతం వేశారు. కానీ ఇప్పటివరకు పనులు మాత్రం మొదలుపెట్టలేదు. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.

పనుల్లో జాప్యం

మండలంలోని 10 గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వం 2023 ఆగస్టులో సుమారు రూ.24 కోట్ల నిధులు మంజూరు చేసింది. వెంటనే అదే సంవత్సరం సెప్టెంబర్ నెలలో అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపనలు సైతం చేశారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక పనులు మొదలవుతాయనుకున్నా అది జరగలేదు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. పార్లమెంట్ ఎన్నికలు సైతం పూర్తయినా పనులు మాత్రం కావడం లేదు. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందిపడుతున్న వాహనదారులు, ప్రజలు

మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం-చందానగర్, ఎనికేపల్లి-బాకారం, నక్కలపల్లి-వెంకటాపూర్, సురంగల్-వెంకటాపూర్, మొయినాబాద్-ముర్తూజగూడ, కనకమామిడి-వెంకటాపూర్, తోలుకట్ట-ఎత్‌బార్‌పల్లి-నక్కలపల్లి, నాగిరెడ్డిగూడ-బాకారం గ్రామాల రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఆయా గ్రామాల రోడ్లను గత పదేళ్లుగా పట్టించుకోలేదు. 2014లో కొన్ని రోడ్లకు బీటీ వేశారు. ఆ తర్వాత ఇంతవరకు రోడ్ల మరమ్మతులు చేపట్టలేదు. గత మూడేళ్లుగా వర్షాలకు రోడ్లన్నీ బాగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మళ్లీ వర్షాకాలం మొదలుకావడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రాత్రి సమయాల్లో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు నిమిషాల్లో వెళ్లాల్సి ఉండగా గుంతల కారణంగా అరగంటకుపైగా సమయం పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు మొదలుపెట్టాలని కోరుతున్నారు.

నిధులు మంజూరైనా మొదలు కాని పనులు

- కనకమామిడి-వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.6.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ పూర్తయి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా అయ్యింది. కానీ ఇంతవరకు పనులు మొదలు పెట్టడం లేదు.
- పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు అభివృద్ధికి రూ.2.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గతంలో టెండర్లు పిలిస్తే ఎవరూ రాకపోవడంతో ప్రస్తుతం రీకాల్ చేసే ప్రక్రియలో ఉంది.
- శ్రీరాంనగర్-అమ్డాపూర్ రోడ్డ అభివృద్ధికి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి.
- తోలుకట్ట-నక్కలపల్లి రోడ్డు ప్యాచ్ వర్క్‌కు రూ.1.20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ దశలో ఉంది.
- నక్కలపల్లి-వెంకటాపూర్ రోడ్డులో కల్వర్టు నిర్మాణం, ప్యాచ్ వర్క్‌కు రూ.38.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే పనులు మొదలుపెట్టారు.

అధ్వానంగా మారాయి



రోడ్ల అభివృద్ధికి ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేశారు. కానీ ఇప్పటివరకు పనులు చేపట్టడం లేదు. రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్రఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకొని త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలి.

-సంగెరి మల్లేశ్, మాజీ సర్పంచ్, చిలుకూరు

రీకాల్ కోసం ప్రభుత్వానికి పంపాం



మండలంలోని కొన్ని గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కొన్ని రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి. టెండర్లు పూర్తికాని రోడ్లను రీకాల్ చేసేందుకు ప్రభుత్వానికి పంపాం. శ్రీరాంనగర్-అమ్డాపూర్ రోడ్డు పనులు మాత్రం జరుగుతున్నాయి.

-విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్

- సురంగల్-వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రీకాల్ ప్రక్రియలో ఉంది.
- ఎనికేపల్లి-బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రీకాల్ ప్రక్రియలో ఉంది.
- నాగిరెడ్డిగూడ-బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు మాత్రం మొదలుపెట్టలేదు.
- మొయినాబాద్-ముర్తూజగూడ-అమ్డాపూర్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రీకాల్ ప్రక్రియలో ఉంది.
- చిలుకూరు-మొయినాబాద్-సురంగల్ రోడ్డు అభివృద్ధికి రూ.2.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు నాణ్యత లేకుండా రోడ్డువేశారు. మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు మట్టి, కంకర పోసి వదిలేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీళ్లు రోడ్డు మధ్యలో నిలుస్తున్నాయి.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు మండల నాయకులు శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన బీసీ సంఘం మండల అధ్యక్షుడు రాములు, ఆలూరు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కసిరే వెంకటేశ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వసంతం, వీరేందర్‌రెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, రాములు, మల్లేశ్, చంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, పాండుయాదవ్, జనార్దన్, శ్రీను, చెన్నయ్య, సురేందర్, తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం


చైర్మన్ శివసేనరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన శివసేన రెడ్డిని శనివారం షాద్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో శివసేన రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, అన్నారం రఘు, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, ప్రవీణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు


గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చేవెళ్ల: ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ అన్నారు. మండలంలోని ఊరెళ్ల, మొండివాగు గ్రామాల్లో శనివారం పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరంలో పాల్గొని సేవలను పొందాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ ఉపసర్పంచ్ విఠలయ్య, నాయకులు ప్రభు, సునుగంటి కుమార్, రఫీక్, అబ్దుల్, మల్లేశ్, గ్రామస్తులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రులు


కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఆమనగల్లు: పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శనివారం అర్చకులు నాగభూషణస్వామి, శరత్‌చంద్రలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, భక్తులు రచ్చ అంజయ్య, బుచ్చమ్మ, ప్రమోద్, మీరా, బికుమాండ్ల శ్యాం, ధనలక్ష్మి, రవిప్రసాద్, ప్రతిభ, అలివేలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామ అభివృద్ధికి సహకరించాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు శనివారం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనంతో పాటు సీతారామ శాస్త్రినగర్‌లో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. వైఎస్‌ఆర్ మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొక్క సత్యనారాయణరెడ్డి, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ వ్యవస్థను కొనసాగించాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వీఆర్‌ఓల సంఘం వినతి


ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఓల సంఘం నాయకులు

చేవెళ్ల: రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓలుగా కొనసాగిన గత వీఆర్‌ఓల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వీఆర్‌ఓల సంఘం నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆయన నివాసంలో కలిసిన చేవెళ్ల డివిజన్ వీఆర్‌ఓల సంఘం నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓల సంఘం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఓల వ్యవస్థను రద్దు చేసి వీఆర్‌ఓలను సర్దుబాటు పేరుతో వివిధ శాఖలలో వేయడంతో ఉద్యోగ హక్కులు, మానవ హక్కులకు తీవ్ర విఘాతం కలిగిందన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు వీఆర్‌ఓల సమస్యలైన సర్వీస్ ప్రొటెక్షన్, పే ప్రొటెక్షన్ కల్పిస్తూ వీఆర్‌ఓలను తిరిగి రెవెన్యూ శాఖలో తీసుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఓల సంఘం ఆధ్వర్యంలో అందరూ ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వీఆర్‌ఓల సంఘం నాయకులు రాఘవేందర్‌రావు, వీరకుమార్, ప్రసాద్, రాములు, శంకరయ్య, గోపాల్, వెంకటేశ్, నాగేశ్వర్‌రావు, రఘుపతిరెడ్డి, కిష్టయ్య, నర్సింహ్మ, మహ్మద్, లింగం, నాగరాజు, తదితరులు ఉన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులే కీలకం

మొయినాబాద్‌రూరల్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని విశ్వకర్మ మండల గౌరవ అధ్యక్షుడు వడ్ల నర్సింహ్మాచారి, కాంగ్రెస్ మండల నాయకుడు గోపికృష్ణారెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చాలా సంవత్సరాలుగా రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన ఉపాధ్యాయుడు అబ్దుల్‌ఖాదర్ బదిలీపై వెళ్లడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు స్వరూపా, మంజుల, సంజీవన్, సంగీత, అరుణ, సత్యనారాయణ, అదే విధంగా ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన గిరిజ, మంజులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు అలివేలు, మహేశ్వరీ, శంకర్, జ్యోతి, శోభ, లక్ష్మి, వినోద్, కైసర్ అహ్మద్, అశ్విణీ, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖాదీర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

కొందుర్గు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రామచంద్రాపూర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జంగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సొంత స్థలాలు ఉన్న పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు వెంటనే మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ ఇళ్లకు మరమ్మతులు చేయించి పేదలకు పంచాలన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేల కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు చూపిస్తున్న శ్రద్ధ ఆరు గ్యారంటీల అమలుపై ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. పేదలకు ఇచ్చిన హామీలను నెరవర్చకుంటే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కొందుర్గు మండల కేంద్రంలో 2007లో 74 మంది పేదలకు యేనేగడ్డపై సర్వే నెంబర్ 237లో ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారని, లబ్ధిదారులు సదరు స్థలాల్లో గుడిసెలు కూడా వేశారని గుర్తుచేశారు. ఈ స్థలాల్లో ఇళ్లు నిర్మించాలని గత ప్రభుత్వం హయాంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించామని అయినా ఫలితం దక్కలేదన్నారు. ఈ ప్రభుత్వమైన పేదల సమస్యలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహా, యాదయ్య, సురేశ్, భూపాల్, బందెమ్మ, యాదమ్మ, బాలకృష్ణ పాల్గొన్నారు


మాట్లాడుతున్న జంగయ్య

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతిచెందిన ఆవు వద్ద రైతు

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని పర్వతాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డబ్బు శంకరయ్య ఆవు పొలం వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.90వేలు ఉంటుందని స్థానికులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తుర్కయంజాల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని కౌన్సిలర్ ఉదయశ్రీ పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఓ సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ సిబ్బందితో పాటు కౌన్సిలర్ మురికి కాల్వల్లో ఆయిల్ బాల్స్, టెమిఫాస్ పైరిత్రమ్ వంటి రసాయనాలను పిచికారీ చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించి వ్యాధుల బారి నుంచి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా మహాసభను విజయవంతం చేయండి

షాద్‌నగర్: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా మూడో మహాసభ ఆదివారం 11 గంటలకు పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పోరాడేందుకు ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. దివ్యాంగులు పెద్దసంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

శంకర్‌పల్లి: ల్యాబ్స్‌లలో డెంగీ, మలేరియాలు పాజిటివ్ అని తెలితే మండల వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. శనివారం శంకర్‌పల్లి, టంగటూర్ పీహెచ్‌సీ పరిధిలోని ల్యాబ్స్ యాజమానులతో సమావేశమయ్యారు. సీజనల్ కాలంలో రోగులకు చేయాల్సిన పరీక్షలపై ఆయన పలు సూచనలు చేశారు. ఒక రోగికి ఒకసారి డెంగీ పరీక్షలో పాజిటివ్ అని తెలితే రెండోసారి పరీక్ష చేసిన తర్వాతే నిర్ధారణకి రావాలన్నారు. గుర్తింపు లేని డాక్టర్లు ఇచ్చే పరీక్షలకు ల్యాబ్స్, మెడికల్‌వారు మందులు ఇవ్వొద్దని కోరారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో శంకర్‌పల్లి మండల వైద్యాధికారి రేవతిరెడ్డి, సిబ్బంది గోపాల్ రెడ్డి, బాబురెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న దామోదర్

పేరుకుపోయిన చెత్త తొలగింపు


మొయినాబాద్‌లో రోడ్డు పక్కన వేసిన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: మండల కేంద్రంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పంచాయతీ అధికారులు తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. మొయినాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య లోపంపై 'రోడ్ల పక్కనే చెత్తా చెదారం' అనే శీర్షికతో శనివారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. రెండో శనివారం సెలవురోజు అయినా పంచాయతీ అధికారులు గ్రామంలో పర్యటించి వీధులను పరిశీలించారు. రోడ్ల పక్కన, వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని పంచాయతీ సిబ్బంది తొలగించారు. గ్రామంలోని పరిసరాలన్నీ శుభ్రం చేయించారు.

సమయం వృథా చేయొద్దు

విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ

మీర్‌పేట: మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు అవసరమని, లక్ష్య సాధనకు సమయం వృథా చేయకుండా ముందుకు సాగాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం మీర్‌పేట టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఆలోచించి అడుగు వేయాలని, ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌లు, ఇంటర్ నెట్ సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో విషయాలు తెలుస్తున్నాయని, కొత్త విషయాలపై పట్టు సాధించేందుకు ఎప్పటికప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవడంతో పాటు సమయానుకూలంగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడ్డాక తల్లి దండ్రులను ఎల్లప్పుడూ గౌరవించుకోవాలన్నారు. చదువుతో సంపాదించిన డిగ్రీలతో పాటు విలువలు ఎంతో అవసరమని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు పట్టా, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ, తదితరులు